# తెరలు

రచన:
శ్రీ వి. ఎస్. ఆర్. మౌళి.

(గత సంచిక తరువాయి)

అంతమందివుండికూడ ఒక్కరూ పట్టించుకోకపోవడం బాధగావుంది, ఇప్పటి సభ్య సమాజంలో ఒకరి సంగతి ఒకరు పట్టించుకోకూడదు. ఎవరిదారి వారిదే అన్నట్టుంటారు, నాది కాకపోతే సరి అన్నట్టుంది. అయినా అసలు మనిషికే బాధ్యత లేకుండా పడి వున్నాడు, అంతా అవకాశవాదులే, వాసు కోపాన్ని దిగమ్రింగుకుంటూ ఎలాగో చందూలాల్ ని కూర్చోబెట్టి, టాక్సీలో సింగ్, మోనాలను పంపించాడు. లాల్ తిడ్తున్నాడు వాసుని.

వాసు యింటికి చేరుకున్నాడు అర్ధరాత్రి. నిద్ర పట్టడంలేదు. అసలు భారతి వినతగురించి చెప్పిం దగ్గర్నుండీ మనశ్శాంతి కరువైంది. నిజంగా వినత అంత ఫ్రీగా మూవ్ అవుతుందా? అయినా గోపాల్ చూసీ చూడనట్టుంటాడేం? అసలు వాళ్ళిద్దరూ తగవులాడుకున్నట్టే ప్రవర్తించడంలేదు. కొన్నాళ్ళకి భారతి కూడా యింతేనా? వాసు అర్ధంకాని వేదనలో ప్రక్కమీద దొర్లుతున్నాడు. కళ్ళు మూసుకుంటే వినత, భారతి, సింగ్ కనిపిస్తున్నారు. భారతిని చెడ్డగా వూహించడానికి భయపడ్తున్నాడు. సింగ్ భారతి అందాన్ని పొగుడ్తాడు, తనకి ఈర్ష్య! పరాయి పురుషుడు పొగిడ్తే అందల మెక్కుతారు ఆడవారు.

భారతి తప్పులేదు, మొదటకూడా తనే బలవంతంగా అన్నింటికీ తీసికెళ్ళడం, అయివుండాలి, సోషల్ గా బిహేవ్ చెయ్యాలనీ ఎన్నెన్నో నూరిపోశాడు. తనకి మతి లేదు, భారతిని శంకించడానికి కూడ అనర్హుడే! ఒకవేళ తమ కాపురం యీ కలతల మూలంగా తుఫానుకి లోనైతే? తను జాగ్రత్తగా వుండాలి, అటువంటి పరిస్థితి రానీయను. తన చదువు, సంస్కారం ఏమయిపోయాయి?

భారతి వచ్చింది, ఆరోజంతా ప్రయాణం కబుర్లే చెప్పింది, వినత, గోపాల్ వెళ్ళిపోయారు. భారతిని దగ్గరగా తీసుకోవాలని కోరికగావున్నా ఎందుకో సంకోచంగా అనిపించింది.

తెలతెలవారుతూంది, చల్లని గాలికి దోమ తెర పల్చగా కదుల్తూంది, వాసు వులిక్కిపడి కళ్ళువిప్పి, సర్దుకుని ప్రక్కకి తిరగబోయాడు, ఊహుం, వీలు కాలేదు. భారతి అతన్ని అంటిపెట్టుకుని వుంది. ఆ ప్రత్యూష సమయంలో వాసు మనసు తృప్తిగా, ఆనందంగా వుంది, ఆర్తిగా భారతిని యింకా దగ్గరగా లాక్కున్నాడు, అన్ని రోజుల చికాకు, ఆవేదనా తుడుచుకుపోయాయి.

ఏడు గంటలకి బద్ధకంగా కళ్ళువిప్పి ప్రక్కకి చూసాడు. వంటింటిలోంచీ వాసనలు నోరూరిస్తున్నాయి, తొందరగా లేచి వెళ్ళి ముఖం కడుక్కుని వచ్చాడు వంటింటిలోకి. తువాలు భుజంమీద వురిచుకుంటూ భారతిని పరీక్షగా తిలకించాడు, స్నానం అయిపోయినట్టుంది, ఇస్త్రీది తెల్లని చీరతో మళ్ళీ చూడాలనిపిస్తూంది. బరువుగా లేపనున్న బారు జడని మెడటిలో రిబ్బన్ తో మాడివేసింది, కొంగుబొడ్డులో దోపుకుంటూ, యిటుచూసి మందహాసం చేసింది, సౌంజ్ఞ చేసి పిలిచాడు, దగ్గరకు వచ్చిన భారతిని బాహువులమధ్య బిగువుగా బంధించాడు, గుండెకు హత్తుకున్నాడు, భారతి కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి, వాసు అలాతనని దగ్గరకుతీసుకుని ఎన్నాళ్ళయింది? తేరుకుని చిరునవ్వుతో అంది.

"ముందు టిఫిన్ కానీయండి, కాఫీ చల్లారిపోతూంది."

వాసు ఆమెని వదలలేదు, ఆమె సుకుమారమైన చేతులు తన చెంపలకు రాసుకుంటూ అంటున్నాడు,

"భారతీ! నన్ను క్షమిం..."

ఆమె అతని పెదవులకు అడ్డంగా వేలుంచింది చిరుకోపంతో. ఆ చేతిని మెల్లగా తీసి "నిజంగానే! నేను దురుసుగా ప్రవర్తించాను కదూ? నేను... నేను యిహమీదట క్లబ్బుకి పోను భారతీ" అన్నాడు మెల్లగా. భారతి వింతగా చూసింది, ఏదో ఆశ

బోతూంటే అవతలపని మనిషి పిలిచింది. దాన్ని పంపించి వచ్చేసరికి అతను టేబిల్ ముందు కూర్చుని వున్నాడు, టిఫిన్ తినలేదు.

"ఆదేం తినలేదూ?"

"నువ్వుకూడరా! కలసి తిందాం" ఒకరినొకరు తినిపించుకుంటూ పూర్తిచేశారు, కుర్చీవెనక్కి జారగిల బడుతూ అన్నాడు.

"భారతీ! మరి—గోపాల్ వాళ్ళూ..." పూర్తి చేయలేదింకా.

"ష్! ఆ విషయం మరచిపోండి, ముందు దీనికి సమాధానం చెప్పండి, మీరు క్లబ్బుకి వెళ్ళనన్నారు, కారణం?" "నేను ముందు అడిగాను."

"వూహూం జవాబు ముందు మీరే చెప్పాలి" "వినడానికి ఓపిక వుందా? మధ్యలో..." "ఏం అడగను, సరా?" నవ్వింది. వాసుకూడా నవ్వేశాడు.

వినత, గోపాల్ గురించి నువ్వు చెప్పిందగ్గర్నుండీ నా మనసు అదోలా అయిపోయింది. ఈ సంఘం, మర్యాదలూ అంటూ ఏవో ఫార్మాలిటీస్ కోసం మనం జీవితాలనే కాలదన్నుకుంటున్నాం అనిపించింది. నా వైపునుండి ఎప్పుడూ ఆలోచించలేదు యిప్పటివరకూ. కాని ఆనాటి ప్రసంగంలో ఆ అవుసరం కలిగింది. వినత ప్రవర్తనకి గోపాల్ స్థానంలో నేనుంటే? చచ్చినా నమ్మేవాడ్ని కాను. వెంటనే చంపేసి వుందును" భారతి కళ్ళు పెద్దవయ్యాయి.

"అంటే యింకోక విధంగా నిన్ను అనుమానించి నట్లే! కాని నీకూ, వినతకూ తేడావుంది, నా కోరిక మీదనే నువ్వు నావెంట వచ్చావు, అయితే యేం? ప్రతి మనిషికీ ఏదో బలహీనత లుంటాయి, ఎంత గుండె ధైర్యమున్న వ్యక్తైనా ఏదో ఒకరోజు వులిక్కి పడతాడు, అలాగే నేనుకూడ. అసలు అనుమానం మొలకెత్తకనేపోవాలి, మొలకెత్తిందా, అది శాఖలుగా వ్యాపిస్తుంది ఆసమయంలోనే! ఆ బలహీనతకు లొంగిపోయాను" భారతి దగ్గరగా జరిగింది. ఆమె గాజులు సవరిస్తూ అన్నాడు తిరిగి.

"నువ్వు ఊరు వెళ్ళింతిరువాత క్లబ్బులోనే గడిపాను. ఒంటరితనం మనిషికి పరమ శతృవు అని మొదటిసారిగా తెలుసుకున్నాను భారతీ! ఆ గొడవంతా చెప్పాడు, భారతి నిట్టూరుస్తూ లేచింది.

"పోనీ లెండి, అనవుసరంగా మీరు చెడ్డవారయ్యారు అక్కడ. అయినా మీ అలవాట్లు మార్చుకోవడ మెందుకు? కొంటెగా అంది.

"కాదులే! ఒకరికోసం మన అలవాట్లు మార్చుకోవడం కష్టమే, కాని తప్పనిసరి అయితే..." వాసు నవ్వేశాడు.

"చూడు భారతీ! ఏపనైనా చేసేముందు, ఆక్షేపించేముందూ, మనం ఎంత ఆచరణలో పెట్టాం యితరులకి చెప్పడానికి అని ఆలోచించే తత్వం నాది. అందుకే...క్లబ్బుకి పోవడంలేదు అంటున్నాను. మర్యాద, ఫాషన్ల పేరుమీద ఎన్ని ముసుగులైనా కప్పుకో గలుతాం, కాని ఒక్క గాలి విసురుకి అవి చెదరిపోతున్నాయి. నిజాన్ని అంగీకరించులేక, నగ్న సత్యాలు వంటబట్టించులోలేక అవస్థపడతాం. అక్కడ జరిగే ఘోరాలు...ఛీ! జరిగిపోయిందిలే పీడకల. అందర్నీ మార్చటం మన తరం కాదు, ఏ ఒక్కర్ని మార్చగలిగినా సంతోషమే, నేను మారిపోయానని ఆశ్చర్యపడుతున్నావా? ఈ రోజులో మనమధ్యనున్న తెరలు ఎగిరిపోవాలి, ఈ తెరల వెనకనుండి సమాజం అద్భుతంగా ఆకర్షిస్తుంది, అందరిలాగా, వాటివెనుక ఏముందో అని అనుకుని, అటుచేరుకోవడానికి ప్రయత్నిస్తాం, కాని ఒక్కసారి ఆ తెర ఆవలికిపోయి చూస్తే? ఇంతేనా అనుకుంటాం. తీరా అందులో మునిగి లోతు తెలిసి భయపడి వుపయోగం ఏముంది? మళ్ళీ యీవలికి రావడం మనచేతులలో వుండదు. ప్రయత్నిస్తే, ఎక్కడో ఎప్పుడో ఒడ్డు చేరతాం. కాని అప్పటికి జీవితంలోని మాధుర్యపు గుర్తులే వుండవ్... ఇందులో పూర్తిగా మనం మోనగలేదేమో, ఒడ్డున నిలబడే చూస్తున్నాం. అందుకే సులభంగానే తీరాన్ని చేరుకున్నాం."

భారతి చిన్నగా చప్పట్లు చరిచింది, "అబ్బ! ఏం వుపన్యాసం! అద్భుతం..."

భారతి చెలిమెలివేశాడు.

"నీకు వేళాకోళంగా వుందేం?" "మరి మీకు కాలక్షేపం?" చూపుల్లో కొంటెతనం తొంగి చూస్తుంది. "అమ్మ దొంగా! అప్పగించావ్!"

అతను గంభీరంగా ముఖంపెట్టాడు. "యింతోటి వుద్యోగం నీ మొగుడేగా వెలగబెడ్తూంది?" భారతి నవ్వలేక పొట్టచేత్తో పట్టుకుంది, వాసు శృతికలిపాడు. "పోనీ, అప్పుడప్పుడూ వెళ్ళిరండి, పాపం! ఎంతైనా అలవాటైన ప్రాణం వుండలేదు" కవ్వించింది.

అతను తర్జనిలో బెదిరించాడు.

"ఇదిగో భారతీ! నువ్వు యిలాగే అంటూండు. నేను...యధాప్రకారం,"

"అంత చంచల మనస్కులా?" "గడుసు దానివి. అన్నీ నాచేతవాగించి నవ్విస్తున్నావే!"

హాయిగా నవ్వుకున్నారు.

నాల్గు రోజులతరువాత వాసు యింటికి వచ్చేసరికి, భారతి ఒక వుత్తరం అందిచ్చింది. "ఎక్కడ్నుండీ?" "చదవండి తెలుస్తుంది" లోనికి వెళ్ళింది.

"డియర్ భారూ!

మేం సేఫ్‌గా చేరాం, మీవారు ఎలాగున్నారు? మన నాటకం తెలిసిపోయిందా? నిజంగానే నాకూ, గోపాల్‌కీ తగువు వచ్చిందనుకున్నారా! తాపీగా మన వుత్తరాన్ని వివరించు మీ ఆయనకి. అయినా యీమగాళ్ళు—వాళ్ళే ఎంతో గుండె నిబ్బరంగలవారమనీ, అదనీ, యిదనీ అనుకుంటారు. సమయంవస్తే మాత్రం—ఒట్టి ఓటికుండలే. పైగా అనుమానం! వాళ్ళమీద వాళ్ళకే వుండదు నమ్మకం. అందులోనే స్వవిమర్శలూ; ఆ విమర్శకి నెగెటివ్ ఆన్సర్ రావచ్చు. ఆడదాని మాటకి విలువ ఎందుకివ్వాలి? అని అనుకుంటారు కొందరు. మరి భార్యా భర్తలన్నప్పుడు—ఒకప్పుడైనా మగవాడు భార్య మాట గౌరవించే సమయం వస్తుంది. ఎలాంటి వేళల్లోనూ మనదే పై చేయి అనుకోకూడదని నా వుద్దేశం. ఏమంటావ్? ఈ ప్లాన్ ఎలా పనిచేసింది? ఆత్మ విమర్శ వచ్చినపుడు, తప్పు, పొరబాటు వప్పుకుంటాడు ప్రతీ వ్యక్తి. నో! నీ విషయంలో మంచినే ఎక్స్‌పెక్ట్ చేద్దాం. వుంటాను. బై! బై!

"నీ వినత."

ఈవిడకి సైకాలజీలో ప్రవేశముందా? అని వాసు అనుకుంటూ పి. యస్. అని వ్రాసినది మళ్ళా చదవసాగాడు.



## — తెలివి —

ఎవరి నోట విన్నా ఇదే మాట—

సుబ్బరామయ్య కాలేజకని పది ఎకరాల భూమి విరాళంగా ఇచ్చారట.

ఎలా ఇచ్చాడని ఒకరంటే—ఏదో పెద్ద కారణం వుండివుంటుంది అని మరొకరు.

సుబ్బరామయ్య నా చిన్ననాటి స్నేహితుడు. నాకు చాల సన్నిహితుడు. వాడు పిసినారి, పది ఎకరాల భూమి కాలేజికి విరాళంగా ఇచ్చాడంటే నాకు విచిత్రంగానే తోచింది. అందుకని—

ఆరోజు సాయంత్రం—

"ఓరేయి! కాలేజకని పది ఎకరాల భూమి దానం చేశావట! నిజమేనా" పశ్నించాను సుబ్బరామయ్యను.

"అవున్రా! వూరు బయట నాకు యాభై ఎకరాల భూమివున్న సంగతి నీకు తెలుసు. ఆ భూమికి డిమాండు రావడానికి ఇంకా పది సంవత్సరములు అవుతుంది. అందుకని—చివర వున్న పది ఎకరాలు కాలేజకని దానంచేశాను. ఇంకో సంవత్సరంలోగా ఆ స్థలానికి కంతా డిమాండు వస్తుంది. ఆ స్థలం అమ్మేయాలన్న ఉద్దేశ్యం నాకుంధి" అన్నాడు సుబ్బరామయ్య.

వాడి తెలివికి మనసులోనే బోహార్లర్పించి బయటకు వచ్చేశాను.

—ఎం. రాజేందర్.

---

"భారతీ! యిదంతా చదివి నాకు సైకాలజీ తెలుసా అని మిస్టర్ వాసు అనుకోగలరు. అనుభవం నేర్పిన పాఠం ఏదీ నేర్పలేదని చెప్పవోయ్!"

వాసు కను బొమ్మలు క్షణమాత్రం ముడుచుకున్నాయి. అంతే, ఆనందంగా నవ్వుకున్నాడు. ఏదో అనబోతూ అడుగుపెట్టిన భారతిని చుట్టేసి, మాట్లాడేందుకు అవకాశం యివ్వలేదు. (సంపూర్ణం)